


# కరపత్రం

SINCE 2014

శుక్రవారం జూన్ 27 2025 | సంపుటి :0 | సంచిక :252 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

# స్కూల్స్,కాలేజీల్లో డ్రగ్స్ దొరికితే యాజమాన్యాలదే బాధ్యత

## ఫీజులు వసూళ్లే కాదు..పిల్లల నడవడిని కట్టడి చేయాల్సిందే




- అవసరమైతే సైకాలజీ ప్రొఫెషనల్స్‌ను నియమించుకోవాలి
- మదక ద్రవ్యాలను అరికట్టే సందర్భంలో కఠిన చర్యలు తప్పవు
- డ్రగ్స్ వ్యతిరేక సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,జూన్26 :** స్కూల్స్, కాలేజీల్లో మాదక ద్రవ్యాలు దొరికితే అది టీచర్లదే బాధ్యత అని.. పర్యవేక్షించాల్సిన బాధ్యత యాజమాన్యాలదేనని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ దొరికితే యాజమాన్యాలపై కూడా కేసులు పెట్టండని ఆదేశిస్తున్నానని సీఎం రేవంత్ అన్నారు. ఫీజులు తీసుకుంటాం.. బాధ్యత తీసుకోం అంటే కుదరదని హెచ్చరించారు. బిహేవియరల్ ఛేంజెస్ గురించి చెప్పే సైకాలజీ ప్రొఫెషనల్స్ ను నియమించుకోవాలని విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచించారు. పిల్లల వ్యవహార శైలిలో మార్పును గమనించాల్సిన బాధ్యత టీచర్లది, యాజమాన్యాలదేనని అన్నారు. శిల్పకళా వేదికలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్జాతీయ యాంటీ డ్రగ్ , ఇల్లీగల్ ట్రాఫికింగ్ డే అవగాహన కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. డ్రగ్స్, గంజాయి గురించి టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇస్తే.. కట్టడి చేస్తామని అన్నారు. స్కూల్స్, కాలేజీల్లో కూడా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్కూల్స్, కాలేజీల ముందు గంజాయి చాక్లెట్స్ అమ్మినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. హైదరాబాద్ టార్గెట్ న్యూయార్క్ అని.. బెంగళూర్, ముంబై, ఢిల్లీ కాదని అన్నారు. తెలంగాణలో 68 శాతం జనాభా యువత అని.. యువతకు స్కిల్స్ పెంపొందిం

చేందుకు శిక్షణ ఇస్తే న్యూయార్క్ తో పోటీ పడగలమని అన్నారు. మాదక ద్రవ్య రహిత సురక్షితమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. యువతను ఆరోగ్యకరమైన ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపించడమే లక్ష్యంగా కలిసి పని చేద్దామని 'కోరారు. డ్రగ్ ఫ్రీ తెలంగాణ సంకల్పానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఐటీ, ఫార్మా హబ్‌గా ఉన్న తెలంగాణ.. గంజాయి, డ్రగ్స్ హబ్‌గా మారితే మనందరం విఫలమైనట్టేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ గడ్డపై గంజాయి, డ్రగ్స్ వైపు చూస్తే వారి వెన్ను విరుస్తామని ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణమే స్పష్టంగా చెప్పానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 'తెలంగాణ అంటే ఉద్యమాలు.. పోరాటాల గడ్డ. ఉద్యమాల గడ్డ డ్రగ్స్‌కు అడ్డాగా మారితే అవమానకరం. పాఠశాలల నుంచి యూనివర్సిటీల వరకు విద్యార్థులపై డ్రగ్స్ ప్రభావం పడింది. డ్రగ్స్ మహమ్మారికి బలవుతున్నారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలైతే దేశం మనుగడకే ప్రమాదం. ఒక దేశాన్ని దెబ్బతీయడానికి శత్రుదేశాలు ఏ మార్గాన్ని ఎంచుకుంటాయో చెప్పలేం. కొన్ని దేశాలు కొవిడ్‌ను ఎంచుకోవచ్చు.. మరికొన్ని దేశాలు డ్రగ్స్‌ను ఎంచుకోవచ్చు. మదక ద్రవ్యాలు తరలించే వారు తెలంగాణ సరహహద్దులో అడుగు పెట్టాలంటే ఒకటికి వందసార్లు ఆలోచించుకునేలా చర్యలు ఉండాలని మంత్రివర్గ సహచరులు, పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చానని అన్నారు.

మిగతాద్ది 2 లో



## వైద్యశాఖలో పలు పోస్టుల భర్తీ

### - నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్,జూన్ 26:** డెంటల్ అసిస్టెంట్ సర్జన్, స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టుల భర్తీకి వైద్యారోగ్యశాఖ పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రెండు నోటిఫికేషన్‌లను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసింది. 48 డెంటల్ అసిస్టెంట్ సర్జన్, 4 స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. స్పీచ్ పాథాలజిస్టు పోస్టులకు జులై 12 నుంచి 26 వరకు, డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు జులై 14 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. మరింత సమాచారం కోసం బోర్డ్ వెబ్ సైట్‌లో చూడొచ్చని తెలిపింది.

2 లో

## బెదరింపు కాల్స్ నేపథ్యంలో ఎంపికి భద్రత పెంపు



**హైదరాబాద్,జూన్ 26:** ఇటీల బెదరింపు కాల్ రావడంతో మెదక్ భాజపా ఎంపీ రఘునందన్‌రావుకు భద్రత పెంచాలని పోలీసు శాఖ నిర్ణయించింది. ఇటీవలే రఘునందన్‌రావుకు మావోయిస్టుల నుంచి బెదిరింపు కాల్ వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన పోలీసు శాఖ మెదక్ ఎంపీకి భద్రత అవసరమని నిర్ధారణకు వచ్చింది. ఇకపై రఘునందన్‌రావు పర్యటనలో ఎస్కార్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈమేరకు మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ముగ్గురు ఎస్పీలకు ఆదేశాలు జారీ అయ్యాయి.

## పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తాం

### - కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**నిజామాబాద్:** నిజామాబాద్ ప్రాంత రైతులకు పసుపు బోర్డు బహుమతి అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్‌లో పర్యటిస్తున్న ఆయన.. మీడియా సమావేశంలో మాట్లాడారు. పసుపు బోర్డు కార్యాలయాన్ని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ప్రారంభిస్తారని చెప్పారు. ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఫోన్‌ట్యాపింగ్ కేసును సీబీఐతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు.

## పిల్లల వరకు చేరుతున్న డ్రగ్స్

### - చాక్లెట్లు, బిస్కట్ల రూపంలో సరఫరా
### - ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి సీతక్క



**ములుగు,జూన్26:** తెలంగాణలో డ్రగ్స్ వ్యసనం రోజురోజుకూ పెరిగిపోతున్న నేపథ్యంలో, నేషనల్ ఆంటీ డ్రగ్స్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ శాఖ చేపట్టింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు చేశారు. డ్రగ్స్ అనే వ్యాధి యువతను భయంకరంగా పీడిస్తోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. 'ఇది ఒకప్పుడు విదేశాల్లో మాత్రమే వినిపించే సమస్య. ఇప్పుడు మాత్రం స్కూళ్ల దాకా ప్రవేశించింది. చాక్లెట్లు, బిస్కెట్లు రూపంలో పిల్లలకు చేరుతోంది.

2 లో

## మరోమూడేళ్లు సిఎం రేవంత్ రెడ్డే

### - ఆ తరవాత ఛాన్స్ కోసం నేను ప్రయత్నిస్తా
### - టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు



**హైదరాబాద్,జూన్26:** మరోమూడేళ్లు రేవంత్‌రెడ్డే సీఎంగా ఉంటారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ సీఎం పదవిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఐదేళ్లు మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తొమ్మిదేళ్ల తర్వాత సీఎం కావడానికి తాను ప్రయత్నం చేస్తానని తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎంగా దిగిపోయాక తాను ముఖ్యమంత్రిని కావడానికి ప్రయత్నం చేస్తానని అన్నారు.

02

## నగరంలో ఆషాడ బోనాల సందడి

### - గోల్కొండలో తొలిబోనం సమర్పించిన కవిత



**హైదరాబాద్,జూన్ 26 :** ఆషాఢ మాసం బోనాలు భాగ్యనగరంలో ప్రారంభమయ్యాయి. చారిత్రాత్మక గోల్కొండ కోటపై వెలిసిన జగదాంబిక ఎల్లమ్మ ఆలయంలో తొలి బోనంతో బోనాల సందడి ప్రారంభమైంది. తెలంగాణ సంస్కృతికి, అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా నగరంలో సందడి మొదలయ్యింది. ఈ క్రమంలో గోల్కొండ జగదాంబిక మహంకాళి, ఎల్లమ్మ తల్లికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత బోనం సమర్పించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు కవిత పేర్కొన్నారు.

## ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎంపీలు ఏం చేస్తున్నట్లు: కేటీఆర్



**హైదరాబాద్:** మెట్రో విస్తరణకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది భాజపా ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వారంతా ఎవరికోసం పని చేస్తున్నారని విమర్శించారు. "గుజరాత్‌కు రూ.2లక్షల కోట్ల విలువైన బుల్లెట్ ట్రైన్ ఇచ్చుకున్నారు. హైదరాబాద్‌కు కనీసం మెట్రోరైలు ప్రాజెక్టు కూడా ఇవ్వరా?" అని నిలదీశారు.

2 లో

## అందుకే నా ఫోన్ ట్యాప్ చేశారు.. కేసీఆర్ పై క్రిమినల్ కేసు పెట్టాలి



ఫోన్ ట్యాపింగ్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు మంత్రి వివేక్ వెంకటస్వామి. దుబ్బాక, మునుగోడు ఉప ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించినందుకే తన ఫోన్ ట్యాపింగ్ చేశారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసిన కేసీఆర్ పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. అమర్ సింగ్ ఫోన్ ట్యాపింగ్ ను సుప్రీంకోర్టు అప్పట్లో తీవ్రంగా పరిగణించిందని గుర్తు చేశారు.

2 లో

# సంపాదకీయం

## అంతరిక్షంలో మనవాడు!



నాలుగు దశాబ్దాల అనంతరం రోదసి నుంచి భారతీయ స్వరం మోగింది. మన వైమానిక దళం గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాతోపాటు అమెరికా, పోలెండ్, హంగేరీలకు చెందిన మరో ముగ్గురు వ్యోమగాములు స్పేస్ఎక్స్ డ్రాగన్ అంతరిక్ష నౌకలో బుధవారం మధ్యాహ్నం సరిగ్గా 12.01 నిమిషానికి 28 గంటల అంతరిక్షయాత్ర ప్రారంభించారు. వీరు అంతరిక్షంలోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు చేరుకుని 14 రోజులపాటు దాదాపు 60 పరిశోధనలు చేస్తారు. 'మేం భూకక్ష్యలో తిరుగుతున్నాం. భారత మానవ అంతరిక్ష కార్యక్రమం మొదలైంద'ంటూ శుభాంశు శుక్లా పంపిన సందేశం ఈ మొత్తం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న శాస్త్రవేత్తల్లో భావోద్వేగం కలిగించింది. ఎప్పుడో 1984లో రాకేష్ శర్మ అంతరిక్ష యాత్ర చేశాక భారత్ నుంచి మరొకరు వెళ్లటం ఇదే ప్రథమం. ఫ్లోరిడాలోని నాసా కెన్నెడీ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ యాత్ర ప్రారంభూ మైంది. గంటకు 28,000 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే ఐఎస్ఎస్... ప్రతి 90 నిమిషాలకూ భూకక్ష్యలో ఒక రౌండ్ పూర్తిచేస్తుంది. ఆ కారణంగా మన శుభాంశు శుక్లా, మరో ముగ్గురు వ్యోమగాములు రోజూ 16 సూర్యోదయాలనూ, 16 సూర్యాస్తమయాలనూ వీక్షిస్తారు. అవనిపై ఎలావున్నా అంతరిక్షంలో దేశాల మధ్య ఇంతవరకూ కొనసాగుతున్న సహకారానికీ, సమన్వయానికీ ఐఎస్ఎస్ ఒక ప్రతీక. అమెరికా అంతరిక్ష సంస్థ నాసా, రష్యా సంస్థ రోస్కాస్మోస్, జపాన్ సంస్థ జాక్సా, కెనడా అంతరిక్ష సంస్థ సీఎస్ఏలు ఉమ్మడిగా ఐఎస్ఎస్ నిర్మాణానికి ముందుకు కదిలాయి. అంతరిక్షంలో ప్రపంచ దేశాలన్నీ పరస్పరం సహకరించుకోవాలని, దాన్ని శాంతియుత ప్రయోజనాలకు వినియోగించాలని, అక్కడి పరిశోధనల ఫలితాలు సమస్త మాన వాళికి అందించాలన్న లక్ష్యాలతో ఐఎస్ఎస్కు అంకురార్పణ జరిగింది. రెండున్నర దశాబ్దాల క్రితం గనుక ఇదంతా కుదిరింది. వర్తమానంలో ఇది సాధ్యమయ్యేదా? ప్రఖ్యాత సైన్స్ ఫిక్షన్ రచయిత ఆర్థర్ సి. క్లార్క్ చాన్నాళ్ల క్రితం 'ఈ విశాల విశ్వంలో రెండే రెండు సంభావ్యతలుంటాయి... అవి%-%మానవాళి ఒంటరైనా కావాలి లేదా కాకపోవాలి' అన్నారు. సకల అంతరిక్ష యాత్రల సారాంశం దాన్ని ఛేదించటమే. ఈ క్రమంలో ఐఎస్ఎస్ ఒక సాధనం. ప్రయోగశాలగా, భిన్న సాంకేతికతల నిగ్గుతేల్చేదిగా భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులో సేవలందిస్తున్న ఐఎస్ఎస్ ఇప్పటికి భిన్న శాస్త్రాల్లో 4,000 ప్రయోగాలకు వేదికైంది. జీవశాస్త్రం మొదలుకొని ఔషధాల వరకూ... భూ విజ్ఞాన శాస్త్రాలు మొదలుకొని భౌతిక శాస్త్రం వరకూ... పర్యావరణ పర్యవేక్షణ నుంచి అంతరిక్ష అన్వేషణ వరకూ ఎన్నెన్నో అంశాల్లో ఐఎస్ఎస్ వ్యోమగాములకు తోడ్పాటునందిస్తోంది. గురుత్వాకర్షణ శక్తి బలంగావుండే భూ వాతావరణంలో కొన్ని కొన్ని పరిశోధ నలు అసాధ్యమవుతాయి. అత్యంత సూక్ష్మ గురుత్వాకర్షణ కలిగి భారరహిత స్థితిలో ఉండే ఐఎస్ఎస్లో సంక్లిష్టమైన పరిశోధనలూ, ప్రయోగాలూ చేయటం, వాటినుంచి ఫలితాలు రాబట్టడం ఎంతో సులభం. ఇవి మనిషి జీవితాన్ని సుఖవంతం చేయగల అనేక సృజనాత్మక సాంకేతికతల ఆవిష్కరణకు తోడ్పడ్డాయి. కమ్యూనికేషన్ల రంగంలో, వనరుల యాజమాన్య నిర్వహణలో, తాగు నీరు స్వచ్ఛతకు వినియోగించే సాంకేతికతల రూపకల్పనలో, అంతరిక్ష యాత్రకు పనికొచ్చే అధు నాతన సాంకేతికతల అభివృద్ధిలో ఈ పరిశోధనలు ఉపయోగపడ్డాయి. అంతేకాదు... మానవాళి భవిష్యత్తు అంతరిక్ష అన్వేషణలకు ఐఎస్ఎస్ వేదికవుతున్నది. ఐఎస్ఎస్ భూమ్మీద రూపొందించి ప్రయోగించింది కాదు. అది కొన్ని రోజుల్లోనో, నెలల్లోనో పూర్తయినది కూడా కాదు. అందుకు దాదాపు పదమూడేళ్లు పట్టింది. అందులోని విడిభాగాల్లో ఎవరేమి తయారుచేయాలో, ఎప్పుడు పట్టుకెళ్లాలో సమగ్ర ప్రణాళికలు రూపొందించుకోగా, 1998 నవంబర్లో మొదలుపెట్టి 2011 వరకూ పునర్వినియోగ అంతరిక్ష నౌకలద్వారా, రష్యన్ రాకెట్ల ద్వారా 30 దఫాలు వందకుపైగా ఐఎస్ఎస్ విడిభాగాలు, సౌరశక్తి ప్యానెళ్లు, కేబుళ్లు వగైరాలు చేర్చారు. వ్యోమగాములు స్పేస్వాక్ చేస్తూ ఈ కేంద్రానికి రూపకల్పన చేశారు. నిద్రపోవటానికీ, తిండికీ, వ్యాయామాలకూ, పరిశోధనలకూ ఇక్కడి నుంచి ప్రయోగించిన మాడ్యూళ్లు తోడ్పడ్డాయి. మొదట్లో ఇది గరిష్ఠంగా 2020 వరకూ పనిచేయొచ్చని అంచనా వేయగా ఇప్పటికీ నిక్షేపంలా ఉంది. తాజా అంచనా ప్రకారం 2030తో దీని జీవితకాలం పూర్తవుతుందని, ఆ తర్వాత కక్ష్య తప్పించి నేలపై పడేవిధంగా చర్యలు తీసుకోవచ్చని భావిస్తున్నారు. కానీ ట్రంప్ ఏలుబడి మొదల య్యాక 2030 కన్నా ముందే దాన్ని దించేయాలని ఎలాన్ మస్క్ వాదించటం మొదలుపెట్టారు. ప్రస్తుతం మస్క్ స్థానమేమిటన్న దాన్నిబట్టి ఐఎస్ఎస్ భవితవ్యం ఆధారపడి ఉంటుంది. మామూలుగా దూరప్రాంతాలకు వెళ్లినప్పుడే ఇంటిల్లిపాదీ ఎంతో భావోద్వేగానికి లోనవు తారు. అంతరిక్ష యాత్రంటే చెప్పేదేముంది? అందులో సాహసమూ, సమస్యలూ కలగలిసి ఉంటాయి. ఎన్నో త్యాగాలకు సిద్ధపడాలి. శిక్షణ కోసం అయినవాళ్లకు దూరంగా ఉండాలి. కష్టతరమైన వ్యాయామాలు తప్పనిసరి. శు భాంశు వీటన్నిటినీ తట్టుకుని నిలబడ్డాడు. వాయుసేన నుంచి అంతరిక్షయాత్ర వైపు అడుగులేశాడు. ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్టు ఇప్పుడు 140 కోట్లమంది భారతీయుల ఆకాంక్షలనూ, నమ్మకాలనూ మోసుకెళ్లాడు. యువతకు స్ఫూర్తిగా నిలిచాడు. శుభాంశు యాత్ర దిగ్విజయం కావాలని, మరో ముగ్గురితో కలిసి ఆయన సాగించే ప్రయోగాలూ, పరిశోధనలూ మానవాళి శ్రేయస్సుకు తోడ్పడాలని దేశ పౌరులంతా ఆకాంక్షిస్తున్నారు.

## మరోమూడేళ్లు సిఎం రేవంత్ రెడ్డే

మొదటి పేజీ తరువాయి
ఆ క్రమంలో తన అప్లికేషన్ ప్రజల దగ్గర పెడుతానని చెప్పుకొచ్చారు. గురువారం గాంధీభవన్లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇకపోతే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకి జగ్గారెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కవిత ప్రతి విషయాన్ని రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. కవిత బీఆర్ఎస్లో ఉంటే ఏంటి.. బయటకు వస్తే ఏంటని ప్రశ్నించారు. ఆమె మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. తండ్రి వారసత్వం కొడుకుకే ఉంటుందని.. ఒకవేళ కొడుకు లేకపోతే కూతురికి వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. తాము స్పందించే అంతటి లీడర్ కవిత కాదనే తమ అభిప్రాయమని జగ్గారెడ్డి అన్నారు. కవిత పెద్ద పెద్ద మాటలు ఎందుకు మాట్లాడుతుందో అర్థం కావడం లేదని చెప్పారు. కేసీఆర్, రేవంత్రెడ్డి సమానమైన ప్రాధాన్యం ఉన్న నేతలని చెప్పుకొచ్చారు. రాజకీయంగా ఒకరిని మరొకరు విమర్శించుకుంటే అర్థముందని అన్నారు. కవిత ఎందుకు అనవసరంగా తమ గురించి మాట్లాడుతోందని ప్రశ్నించారు. హాయిగా బతుకమ్మ ఆడుకోకుండా కవితకి ఎందుకు ఈ పంచాయితీ అని నిలదీశారు. లిక్కర్ స్కాంలో పైసలు పెట్టడానికి కవితకి ఇన్ని వందల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని జగ్గారెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు.

## అందుకే నా ఫోన్ ట్యాప్ చేశారు.. కేసీఆర్ పై క్రిమినల్ కేసు పెట్టాలి

మొదటి పేజీ తరువాయి
ఫోన్ ట్యాపింగ్ చేసిన కేసీఆర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పటాన్ చెరులో కేసీఆర్ తన పరిశ్రమను బంద్ చెయించినా వెనక్కి తగ్గలేదని చెప్పారు మంత్రి వివేక్. తెలంగాణ లో 119 నియోజకవర్గాల్లో గెలిచిన వారందరు రాజులేనన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈడీ నోటీసులు ఇస్తే విచారణకు హాజరయ్యానని.. ట్యాపింగ్ పై విచారణకు పిలిస్తే విచారణకు హాజరవుతానని చెప్పారు మంత్రి వివేక్.

తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసు సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే.. 2023 నవంబర్ 15 నుంచి నవంబర్ 30 వరకు భారీగా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు దర్యాప్తు అధికారులు తేల్చారు. 4013 ఫోన్ నంబర్లను మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు అండ్ టీమ్ ట్యాపింగ్ చేసినట్లు తేలింది. ఫోన్ ట్యాపింగ్ బాధితులు 618 మంది ఉండగా.. ఇందులో పొలిటికల్ లీడర్లు కూడా ఉన్నారు.

618 మందిలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ఐఏఎస్, ఐపీఎస్ , పారిశ్రామిక వేత్తలు, జర్నలిస్టులు కూడా ఉండటం గమనార్హం. రేవంత్ రెడ్డి ఆయన కుటుంబ సభ్యులు, బండి సంజయ్ కుటుంబ సభ్యులు, ఈటెల రాజేందర్ ఆయన కుటుంబ సభ్యులు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులతో పాటు అనుచరుల ఫోన్లు ట్యాప్ అయినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

## పిల్లల వరకు చేరుతున్న డ్రగ్స్

మొదటి పేజీ తరువాయి
ఇది అత్యంత భయంకరమైన పరిస్థితి,' అని సీతక్క అన్నారు. డ్రగ్స్‌ను వ్యాపారంగా మార్చిన కొంతమంది, లాభాల కోసం సమాజాన్ని మత్తులోకి లాగుతున్నారన్నారు. డ్రగ్స్‌కు బానిసలైన విద్యార్థులు, యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటూ తల్లిదండ్రులకు బాధను మిగులుస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'ఇలాంటి వారిని సొసైటీ కూడా తిరస్కరించే అవకాశం ఉంది. ఇది కేవలం వారి జీవితమే కాదు ? సమాజానికే ప్రమాదం' అని పేర్కొన్నారు. మత్తు పదార్థాల వాడకం మూలంగా చిన్నారులపై అత్యాచారాలు, వృద్ధులు ఆడపిల్లలపై రేపులు, హత్యలు వంటి దారుణాలు జరుగుతున్నాయని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. 'ఇది నేరం మాత్రమే కాదు, మానవత్వాన్ని మరిచే స్థితి,' అని అన్నారు.

ప్రభుత్వం డ్రగ్స్ నిర్మూలనకు కట్టుబడి ఉన్నదని పేర్కొంటూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్టాన్ని డ్రగ్స్ రహితంగా మార్చాలనే లక్ష్యంతో కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. 'ప్రతి ఒక్కరూ బాధ్యతగా మత్తుపదార్థాలను తిరస్కరించి, డ్రగ్స్ నిర్మూలన కోసం కృషి చేయాలి' అంటూ ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె పోలీస్ శాఖకు, కార్యక్రమ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. డ్రగ్స్ వంటి ముప్పుల నుంచి సమాజాన్ని రక్షించాలంటే, ప్రభుత్వం మాత్రమే కాదు, ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని అన్నారు.

## స్కూల్స్,కాలేజీల్లో డ్రగ్స్ దొరికితే యాజమాన్యాలదే బాధ్యత

మొదటి పేజీ తరువాయి
యుద్ధం, సైనికులు అంటేనే.. పంజాబ్ గుర్తుకు వచ్చేది. అలాంటి పంజాబ్ ఇవాళ డ్రగ్స్ మహమ్మారి వలలో చిక్కుకుంది. డ్రగ్స్ నివారణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలి యువతను సరైన మార్గంలో పెట్టాలి, అభివృద్ధి పథంవైపు నడిపించాలని స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చాం. 140 కోట్ల జనాభా ఉన్న దేశానికి ఒలింపిక్స్‌లో ఒక్క స్వర్ణపతకం రాకపోవటం గురించి ఆలోచించాం. యువతకు సాంకేతిక నైపుణ్యం అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. డ్రగ్స్ నిర్మూలన బాధ్యత పౌరులపై కూడా ఉంది. పిల్లల ప్రవర్తనను గమనించేందుకు ప్రత్యేకమైన సిబ్బందిని నియమించుకోవాలి. స్టబెక్ట్, పీఈటీలను నియమించుకున్నట్టే బిహేవియర్ అబ్జర్వర్స్‌ను నియమించుకోవాలన్నారు. డ్రగ్స్ నివారణకు ప్రత్యేకంగా 'ఈగల్' అనే విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నాం. గంజాయి పంట, సరఫరా, విక్రయంపై ఈగల్ టీమ్ ప్రత్యేక నిఘా పెడుతుంది' అని సీఎం తెలిపారు. సినీనటులు రామ్‌చరణ్, విజయ్‌దేవరకొండకు ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నా.. యువతకు మంచి సందేశం ఇవ్వాలని, ఈ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు' అని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత దిల్‌రాజు, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కోచ్ పుల్లెల గోపీచంద్, పలువురు ఉన్నతాధికారులు...తదితరులు పాల్గొన్నారు.

## బెదరింపు కాల్స్ నేపథ్యంలో ఎంపికి భద్రత పెంపు

మొదటి పేజీ తరువాయి
రఘునందన్‌రావుకు పీపుల్స్‌వార్ మావోయిస్టు పేరుతో బెదిరింపు కాల్ వచ్చింది. సోమవారం సాయంత్రంలోగా చంపుతామంటూ ఆగంతకుడు ఫోన్ చేశాడు. తాను మధ్యప్రదేశ్‌కు చెందిన మావోయిస్టునంటూ బెదిరించాడు. మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడలో ఓ ప్రైవేటు పాఠశాల కార్యక్రమానికి ఎంపీ హాజరైన సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ఫోన్‌కాల్‌ను రఘునందన్ పీఏ లిఫ్ట్ చేశారు. బెదిరింపు కాల్‌పై డీజీపీ, మెదక్ జిల్లా ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులకు రఘునందన్‌రావు ఫిర్యాదు చేశారు.

## వైద్యశాఖలో పలు పోస్టుల భర్తీ

మొదటి పేజీ తరువాయి
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే వైద్య ఆరోగ్య శాఖ లో 8వేలకు పైగా పోస్టులను భర్తీ చేసినట్టు వైద్య ఆరోగ్య శాఖ ప్రకటించింది. ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్ వంటి మరో 6వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొంది. త్వరలోనే మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వనున్నట్టు తెలిపింది.

## బిసి రిజర్వేషన్లు పెంచుకునే హక్కు రాష్ట్రాలదే

**- స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి**

**- బిజెపి రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్ 30వ తేదీ లోపు జరపాలంటూ కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య వెల్లడించారు. గురువారం హైదరాబాద్‌లో బీజేపీ కార్యాలయంలో ఎంపీ ఆర్ కృష్ణయ్య విలేకర్లతో మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికలు నిర్వహించడం, బీసీ రిజర్వేషన్లు పెంపుపై రాష్ట్ర ప్రభుత్వాలకే హక్కు ఉందని స్పష్టం చేశారు. సందర్భాన్ని బట్టి 50 శాతం పెంచుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. వీటి పెంపులో 50 శాతం సీలింగ్‌కు అడ్డు లేదన్నారు. ఆ క్రమంలో రాజ్యాంగపరమైన అవరోధాలు సైతం లేవని తెలిపారు. త్వరగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి.. ఎన్నికలు నిర్వహించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బీసీ బిల్లుకు అన్ని పార్టీలు ఓకే చెప్పాయని గుర్తు చేశారు. ఈ అంశాన్ని కేంద్రంపైకి నెట్టాల్సిన అవసరం అయితే లేదన్నారు. కేంద్రంపై నెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. సర్పంచ్‌లతోపాటు.. అన్ని ఎన్నికలకు ఇది అప్లై అవుతాయన్నారు. తెలంగాణ జాగృతి నేత, ఎమ్మెల్సీ కవిత ఇటీవల తనను కలిసి.. కొన్ని సలహాలు అడిగిందన్నారు. ఆ క్రమంలో తాను బీసీల కోసం కొట్లాడుతున్నానని చెప్పిందని ఆయన గుర్తు చేశారు. అయితే ఈ అంశంపై కొట్లాడాల్సింది కేంద్రంతో కాదని.. రాష్ట్ర ప్రభుత్వంతో అని ఆమెకు తాను వివరించానని చెప్పారు. ప్రజా భరోసా కార్యక్రమంలో ఫీజు రియంబర్స్‌మెంట్ కోసం అధిక సంఖ్యలో విద్యార్థులు వచ్చారన్నారు. ÷ఖజు చెల్లింపు పెండింగ్‌లో ఉండడం వల్ల విద్యార్థులకు కాలేజీలు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదని చెప్పారు. ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు చెల్లించక పోవడంతో క్లాసులు ఎగ్గొట్టి మరీ విద్యార్థులు ఆందోళనకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రెండు, మూడు విడతలుగా బకాయిలు చెల్లించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన సూచించారు. సొంత భవనాలు లేని ప్రాంతాల్లో కొత్త భవనాలు నిర్మించాలని ప్రభుత్వానికి సూచించారు. స్టడీ సర్కిల్‌లో విద్యా ప్రమాణాలు సైతం పెంచాలని ప్రభుత్వానికి ఎంపీ కృష్ణయ్య డిమాండ్ చేశారు.

## రుద్ర ప్రయాగ్ జిల్లాలో ఘోర ప్రమాదం అలకనందిలో పడ్డ టూరిస్ట్ బస్సు

ఉత్తరాఖండ్ రుద్ర ప్రయాగ్ జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. గురువారం ఉదయం ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ప్రమాదవశాత్తూ అలకనంద నదిలో పడిపోయింది. ఈ ఘటనలో ఒకరు మరణించగా.. మరో 11 మంది గల్లంతయ్యారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే జిల్లా అధికారులు, పోలీసులతోపాటు రాష్ట్ర విపత్తు నిర్వహణ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఆ క్రమంలో ఏడుగురు ప్రయాణికులను రక్షించారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 18 మంది ప్రయాణికులున్నారని అధికారులు తెలిపారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామన్నారు. అందుకోసం గజ ఈతగాళ్లను రంగంలోకి దింపామని పేర్కొన్నారు. అయితే ప్రమాద సమయంలో బస్సు వేగంగా వెళ్తోందని, డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తమ ప్రాథమిక విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. మరోవైపు నదిలో నీటి ప్రవాహం వేగంగా ఉండడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది.

## పోలీస్ కస్టడీ ముగియడంతో జైలుకు కాకాణి తరలింపు

వైకాపా నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి రెండు రోజుల కస్టడీ ముగిసింది. సర్వేపల్లి రిజర్వాయర్‌లో గ్రావెల్ అక్రమ తవ్వకాల కేసులో వైకాపా నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోలీస్ కస్టడీ ముగిసింది. కృష్ణపట్నం పోలీస్‌స్టేషన్‌లో సిట్ డీఎస్పీ రామాంజనేయులు బృందం ఆయన్ను ప్రశ్నించింది. రెండో రోజు కూడా ఒక్క ప్రశ్నకూ జవాబివ్వనట్లు సమాచారం. సిట్ విచారణ ముగియడంతో నెల్లూరు జిల్లా రెండో అదనపు కోర్టులో ఆయన్ని సిట్ అధికారులు ప్రవేశపెట్టారు. అనంతరం నెల్లూరు కారాగారానికి తరలించారు. మొదటి రోజు విచారణలో 30 ప్రశ్నల్లో ఒక్కదానికీ ఆయన సమాధానమివ్వలేదు.

## వాగులో కొట్టుకుపోయిన యువకుడు

ఆదిలాబాద్ పట్టణ శివారు నిషాన్‌ఘాట్ సమీపంలోని వాగులో ఓ యువకుడు గల్లంతయ్యాడు. డాల్డా కాలనీకి చెందిన శేఖర్ చేపలు పట్టేందుకు వాగుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ అతడు వరద ప్రవాహంలో చిక్కుకుపోయాడు. ఇది గమనించిన కొంతమంది అతడిని కాపాడేందుకు ప్రయత్నించారు. ఓ వ్యక్తి వాగులోకి వెళ్లి అతడిని బయటకు తీసుకురావడానికి యత్నించినా ఫలితం లేకపోయింది. వరద ప్రవాహంలో శేఖర్ కొట్టుకుపోయాడు. బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి.

## తెలంగాణ పీజీఈసెట్ ఫలితాలు విడుదల

ఆర్కిటెక్చర్ ప్లానింగ్ విభాగంలో తురియా దీక్షిత్, ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో శివ చరణ్, బయో మెడికల్ ఇంజినీరింగ్‌లో హరిణి, బయో టెక్నాలజీలో తనుజా, సివిల్ ఇంజినీరింగ్‌లో వెంకటేష్, కెమికల్ ఇంజినీరింగ్‌లో అశుతోష్, కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో షభిస్తా, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో శివ ప్రసాద్ మొదటి ర్యాంక్‌లు సాధించారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో మహేష్, ఇన్స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్‌లో చంద్రసేన్, ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్‌లో ఉజ్వల, ఫుడ్ టెక్నాలజీలో నిఖిల్ కుమార్, జియో ఇంజినీరింగ్ జియో ఇన్ఫార్మటిక్స్‌లో డిలైట్, మెకానికల్ ఇంజినీరింగ్‌లో సతీష్, మైనింగ్ ఇంజినీరింగ్ లో అనిల్, మెటాలర్జికల్ ఇంజినీరింగ్‌లో శ్రీ హర్షిణి, నానో టెక్నాలజీలో సాయి కృష్ణ, ఫార్మసీలో షేక్ అర్షియా కౌనేను, టెక్స్‌టైల్స్ టెక్నాలజీలో వర్ష మొదటి ర్యాంక్‌లు సాధించారు.


## లా సెట్ లో ఉత్తమ ర్యాంకర్లను సన్మానించిన టిపిటిఎల్‌ఏ ప్రెసిడెంట్...!



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట : జూన్ 26**
బుధవారం ప్రకటించిన టీజీ లా సెట్ -2025 ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంట్రన్స్ ఫలితాలలో జమ్మికుంట ప్రాంతానికి చెందిన గార్డియన్ స్కూల్ ప్రిన్సిపాల్ మహమ్మద్ అంకుష్, స్రవంతి కాలేజ్ లెక్చరర్ అన్నెబోయిన రాజేందర్ లు ఉత్తమ ర్యాంక్ లు సాధించినందుకు గాను గురువారం టిపిటిఎల్‌ఏ ప్రెసిడెంట్ ఎంఏ రహమాన్ వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రహమాన్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఉత్తమ లాయర్లుగా ఎదిగి పేద మధ్యతరగతి ప్రజలకి సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వప్న, మమత, శ్రీవాణి, శ్రీలత, రేణుక, అనూష, మాలతి పాల్గొన్నారు.

## ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన టీ.ఎస్.పి.ఎ స్టేట్ సెక్రెటరీ..

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ప్రణవ్.
- విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం..



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూన్ 26**
జమ్మికుంట పట్టణ పరిధిలోని 15వ వార్డుకు చెందిన తెలంగాణ రాష్ట్ర స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్ సెక్రటరీ పాతకాల సదానందం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నానని తెలిపారు.ప్రభుత్వం విద్యా వ్యవస్థపై నమ్మకం కలిగేలా కృషి చేస్తుందని,విద్యావ్యవస్థ బలోపేతానికి మరింత కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్,ఇల్లందకుంట దేవస్థాన మాజీ చైర్మన్ దేశిని కోఠి,బోగంపాడు మాజీ సర్పంచ్ తిరుపతి రెడ్డి,15వ వార్డు ఇంచార్జి పాథకాల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ తండ్రి మృతి... పలువురు నాయకుల పరామర్శ:



కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి
రామగిరి మండలం రత్నాపూర్ మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు తండ్రి కొండు సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆర్జీ-3 ఏఐటీయూసీ సెక్రటరీ ఏం. ఆర్.సీ రెడ్డి, ఓసీపీ-2 హెడ్ ఓవర్ మెన్ బత్తుల రమేష్, స్థానిక నాయకులు వేముల రాజు, రాంనగర్ కుమ్మరి ఓదేలు, అమరగొండ శ్రీనివాస్, ఆకుల రమేష్ తదితరులు కరీంనగర్ లో వారి కుటుంబాన్ని పరామర్శించారు.

## ఆంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించిన పోలీసులు

**కరపత్రం ప్రతినిధి అందోలు:**




సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలో పోలీసులు ఆంటీ డ్రగ్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ అనిల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ బారిన పడవద్దనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. డ్రగ్స్ వాడకం వల్ల జరిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పాండు, ఆయా కళాశాలలో

## భావితరాలకు డ్రగ్స్ రహిత సమాజాన్ని అందిద్దాం..

-డ్రగ్స్ రహిత సంగారెడ్డి జిల్లా యే లక్ష్యంగా కృషి చేద్దాం
-జిల్లా వ్యాప్తంగా యాంటీ డ్రగ్స్ డే ర్యాలీలు..
-పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులు
-జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**
మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిర్మూలనే లక్ష్యంగా జిల్లా కలెక్టరేట్ నుండి ఐబి కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులచే ర్యాలీలు నిర్వహించి, ప్రతి ఒక్కరూ యాంటీ డ్రగ్స్ సోల్జర్ గా ఉండాలని ప్రతిజ్ఞ చేయించడం జరిగిందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల దుర్వినియోగం వలన కలిగే చెడు పరిణామాలను గుర్తించాలని, గంజాయి, డ్రగ్స్ బారినపడి యువత అందమైన జీవితాలు కోల్పోతున్నారన్నారు. యువత మంచి లక్ష్యాలను పెట్టుకొని వాటిని సాకారం చేసే దిశగా అడుగులు వేయలే కానీ డ్రగ్స్ కు బానిసలుగా మారకూడదన్నారు. ఈ అవగాహన కార్యక్రమాలను కేవలం యాంటీ డ్రగ్స్ డే వారోత్సవాలలో భాగంగా కాకుండా సంగారెడ్డి జిల్లా డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా మార్చేవరకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, భావితరాలకు డ్రగ్స్ ఫ్రీ సమాజాన్ని అందించాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి వంటి ఇతర మాదక ద్రవ్యాలను విక్రయించినా, అక్రమ రవాణా చేసినా, వినియోగించినట్లు గుర్తించినట్లైతే వెంటనే జిల్లా ఎస్–న్యాబ్ 8712656777 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించవలసిందిగా సూచించారు. ఈ ర్యాలీలలో పాల్గొన్న అన్ని విధ్యాసంస్థల యాజమాన్యాలకు విద్యార్థిని, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.
అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాను డ్రగ్స్ ఫ్రీ జిల్లా గా మార్చడంలో కృషి చేస్తున్న సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖకు అభినందనలు తెలియజేశారు. గురువారం యాంటీ డ్రగ్స్ డే సందర్భంగా ర్యాలీకి హాజరైయన వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు డ్రగ్స్ కు వ్యతిరేకంగా నినాధంతో ప్రతిజ్ఞ చేస్తూ మీ చుట్టూ ప్రక్కల ఉన్న వారికి అవగాహన కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చందర శేఖర్, ఎక్సైజ్ ఎస్పీ నవీన్ చంద్ర, అదనపు ఎస్పీ ఎ. సంజీవ రావ్, డిఇఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు సిబ్బంది, విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థిని విద్యార్థులు, పట్టణ యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జిన్నారంలో హరీష్ రావు రైతు మహాధర్నాతో రైతు భరోసా వేసిన ప్రభుత్వం



- ధన్యవాదాలు తెలియజేస్తున్న రైతులు





**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**
కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా డబ్బులు ఇవ్వకుంటే ఔటర్ రింగ్ రోడ్డును దిగ్బంధిస్తామని శనివారం సంగారెడ్డి జిల్లా జిన్నారంలో జరిగిన రైతు ధర్నాలో మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొని హెచ్చరించారు. దీంతో ప్రభుత్వం దిగివచ్చి రైతుల ఖాతాలో రైతు భరోసా నిధులు విడుదల చేయడం జరిగిందని రైతన్నలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు హరీష్ రావుకు ధన్యవాదాలు తెలుపుతూ జేజేలు పలుకుతున్నారు. మాజీ మంత్రి నివాసానికి వెళ్లి ధన్యవాదాలు తెలుపుతూ సన్మానిస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆధ్వర్యంలో తమ పార్టీ ఎప్పటికీ రైతుల తరఫున పోరాటం చేస్తుందన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకూ తమ ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరువు నియోజకవర్గం ఇంచార్జి ఆధర్శ్ రెడ్డి, జిన్నారం వెంకటేష్ గౌడ్,గోవర్ధన్ రెడ్డి, బల్ రెడ్డి, మెట్టు కుమార్ యాదవ్, సోమిరెడ్డి, రాములు యాదవ్, ఆంజనేయులు యాదవ్, మాణిక్ యాదవ్, రాజేష్, ప్రభాకర్ రెడ్డి, ప్రకాష్ చారి, శివ రాజ్, ఆంజనేయులు, జనార్ధన్, నరేందర్, సురేందర్ గౌడ్, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ, కదీర్, నవీన్, రవీందర్, రామకృష్ణ, శ్రీధర్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, ఆంజనేయులు, సతీష్, కృష్ణ గౌడ్, పమేష్ రెడ్డి, శాంత వర్మ రెడ్డి, అది నర్సింలు, నిఖిల్, రావుల ఆంజనేయులు, బ్రాహ్మందర్ గౌడ్, అనిల్, నర్సింగ్ రావు, అశోక్, మహేందర్, వేణు, గణేష్, కుమార్, గణేష్, యాదయ్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏక పంట విధానానికి రైతులు స్వస్తి పలికాలి...



- లాభదాయకమైన ఆయిల్ ఫామ్ పంట వైపు రైతులు ఆసక్తి చూపాలి...
- పామ్ ఆయిల్ పంట పై ఈసాలాతక్కలపల్లి లో అవగాహన....





కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి
ఏక పంట విధానానికి రైతులు స్వస్తి పలికాలనీ, లాభదాయకమైన ఆయిల్ ఫామ్ పంట వైపు రైతులు ఆసక్తి చూపాలనీ,పామ్ ఆయిల్ పంట పై ఈసాలాతక్కలపల్లి లో జరిగిన అవగాహన కార్యక్రమం లో ఉద్యానవన శాఖ అధికారి ఏ.జ్యోతి, కేవీకే రామగిరి ఖిల్లా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్. భాస్కర్,పాలకుర్తి మండలం వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ లు అన్నారు.ఈ సందర్భంగా కేవీకే రామగిరి ఖిల్లా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్.భాస్కర్ వ్యవసాయ శాఖ పాలకుర్తి, రామగుండం ఉద్యానవన శాఖ అధికారి ఏ.జ్యోతి ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ లో భాగంగా గురువారం పాలకుర్తి మండలం ఈసాలాతక్కలపల్లి గ్రామం లో రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రైతులు పంటల సాగులో వైవిధ్యతను ప్రోత్సహించడం ద్వారా నేల ఆరోగ్యంతో పాటు రైతుల ఆదాయమూ మెరుగుపడుతుందని ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ విస్తరణ పథకం ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను పెద్దపెల్లి జిల్లాకి పామ్ ఆయిల్ పంట 2500 ఎకరాలు లక్ష్యంగా విధించడం జరిగినది అని జ్యోతి వివరించారు.కేవీకే రామగిరి ఖిల్లా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్. భాస్కర్ మాట్లాడుతూ.... వరి పంటకి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ తోటలు ఈ వానాకాలం లో సాగు చేయాలని సూచించడం జరుగుతుంది మరియు ఆయిల్ పాము పంట లాభాలు వివరించారు.ఆసక్తి గల రైతు సోదరులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా పాలకుర్తి మండలం వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ కోరారు.గురువారం చేపట్టిన ఆయిల్ పామ్ పంట అవగాహన కార్యక్రమం లో ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ టి .ప్రశాంత్ ,డ్రిప్ కంపెనీ సిబ్బంది, వ్యవసాయం విస్తరణ అధికారి ఎం .యోజన , అధిక సంఖ్యలో రైతులు పాల్గొనడం జరిగింది.

## బ్లాక్ బెల్ట్ జాతీయ స్థాయి ప్రతిభ:

- లద్నాపూర్ యువ కరాటే ప్లేయర్ పొట్ల శ్రీవన్ కుమార్...



కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి
పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం లోని లద్నాపూర్ గ్రామానికి చెందిన పొట్ల శ్రీవన్ కుమార్ ఈ నెల హైదరాబాద్ లో కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. తను ఇప్పటికే జాతీయ స్థాయి కరాటే క్రీడాకారుడుగా తన ప్రతిభను నిరూపించుకున్నారు. ఈ విజయానికి అతని గురువు నాగరాజు మాస్టర్ నుండి సంవత్సరాల పాటు తీసుకున్న కఠినమైన శిక్షణ ప్రేరణగా నిలిచినది. శ్రీవన్ కుమార్ ఇప్పటికే ఎస్ జి ఎఫ్ ఐ స్టేట్ గోల్డ్ మెడలిస్ట్ తెలంగాణను రాష్ట్ర స్థాయిలో ప్రాతినిధ్యం వహించారు. అలాగే జాతీయ స్థాయి టోర్నమెంట్లలో కూడా తన కుదురైన పోరాటంతో మెరిశారు. ఈ సందర్భంగా శ్రీవన్ మాట్లాడుతూ ....బ్లాక్ బెల్ట్ సాధించటం తన జీవితంలో ఒక గొప్ప మైలురాయి అని తన లక్ష్యం అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు పేరు తీసుకురావటం అని, తమ గ్రామంలాంటి ప్రాంతాల నుంచి కూడా చాంపియన్స్ రావచ్చు అని, తన విజయంతో నిరూపించాలనుకుంటున్నా అని అన్నారు. శ్రీవన్ విజయంతో లద్నాపూర్ గ్రామం నిండా ఆనందోత్సాహ వాతావరణం నెలకొన్నది. క్రీడల పై ఆసక్తి కలిగిన యువతకు ఇది గొప్ప ప్రేరణగా నిలుస్తున్నది.



# యువతీ యువకులు ప్రాణాంతకమైన మాదకద్రవ్యాల కు దూరంగా ఉండాలి

- చెడు అలవాట్లను వీరనాడి లక్ష్యసాధనతో ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి
- ఎవ్వరైనా మాదకద్రవ్యాల వినియోగానికి పాల్పడితే చట్టరీత్యా కఠినంగా శిక్షించబడతారు






**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**
ఎం.హేమలత జూనియర్ సివిల్ జడ్జ్ కం చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల్ లీగల్ సర్వీస్ కమిషన్ నర్సాపూర్ ఆధ్వర్యంలో నర్సాపూర్ ప్రాంతంలో బి.వి.ఆర్.ఐ.టి ఇంజనీరింగ్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూల దినోత్సవాన్ని ఏర్పాటు చేయడం జరిగింది, ఈ కార్యక్రమానికి ఎం.హేమలత జూనియర్ సివిల్ జడ్జ్ కం చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ వీరు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ డ్రగ్స్ మత్తులో యువత నేరలకు పాలపుడుతున్నారని అన్నారు.మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంలో ప్రజలు భాగస్వామ్యం కావాలి.ప్రతి ఒక్కరు మాధకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, భవిష్యత్తు రోజుల్లో మాధకద్రవ్యాల నిర్మూలన నేటి తరం విద్యార్థుల చేతిలోనే ఉంది అని అన్నారు. విద్యార్థుల దృష్టి తమ భవిష్యత్తు జీవిత లక్ష్యం పై మాత్రమే ఉండాలని, నిషేధిత గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల వాడకం పట్ల విద్యార్థులు ఆకర్షితులు కావద్దని న్యాయమూర్తి సూచించారు.గంజాయి డ్రగ్స్ అలవాటు వలన శారీరక మానసిక ఆరోగ్యాన్ని పాడుచేస్తుందని కావున చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.యువత పురోగతికి, భావిత బంగారు బాటలో పయనించుటకు జీవితానికి సార్ధకత ఉండే విధంగా కన్న తల్లిదండ్రులను వారి కలల్ని సాఫల్యం చేసే విధంగా శిఖరాలకు తిరిగి ఉన్నత స్థాయి ఉద్యోగాలను సాధించి సుఖ సంతోషాలతో ఉండాలని తెలియజేయడం జరిగింది, మాధకద్రవ్యాలను సమాజం నుండి సమూలంగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని విజ్ఞప్తి చేశారు.మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే డయల్ 100,1908, పోలీస్ వారికి అందించాలని సూచించారు. వినియోగించే వ్యక్తుల పైన, వికలాలకు పాల్పడే వ్యక్తులపైన చట్టరీత్యా కఠినంగా శిక్షించబడుతారన్నారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నర్సాపూర్ ఏఎస్ఐ, నర్సాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి శ్రీనివాస్ గౌడ్, లీగల్ సర్వీస్ న్యాయవాది సి.హెచ్. స్వరూప రాణి. సీనియర్ న్యాయవాది ఏ. శ్రీనివాస్, లీగల్ సర్వీస్ సోషల్ ఆక్టివిటీస్ న్యాయవాది రాజు నాయక్, బి.వి.ఆర్.టి.ఐ అధ్యాపకులు మహేందర్, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఉద్యోగి కృష్ణమోహన్, లీగల్ సర్వీస్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# రైతుల సమస్యలను పరిష్కరించండి




- చేనేత పద్మ సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు శ్రీకాంత్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూన్ 26**
రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన భూభారతి కార్యక్రమంలో భాగంగా రైతులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి వారి సమస్యలు పరిష్కరించాలని చేనేత పద్మ సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు శ్రీకాంత్ వీణవంక తహసిల్దార్ అంబటి రజితను కోరారు. గురువారం వీణవంక తహసిల్దార్ కార్యాలయంలో ఆమెను కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తహసిల్దార్ దృష్టికి తీసుకెళ్లగా, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నియమ నిబంధనలు పాటిస్తూ రైతుల సమస్యలను పరిష్కరిస్తారని హామీ ఇచ్చినట్లు శ్రీకాంత్ పేర్కొన్నారు. శ్రీకాంత్ వెంట సగర సంఘం జిల్లా అధ్యక్షుడు దేవునూరు శ్రీనివాస్ ఉన్నారు

# పదవి విరమణ పొందుతున్న ఇంజనీర్ కు సన్మానం



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 26:**
ఆర్జీ1 ఏరియా ఇంజనీర్ విధులు నిర్వహిస్తున్న దాసరి వెంకటేశ్వరరావు జూన్ నెలలో పదవి విరమణ పొందుతున్న సందర్భంగా జీడికే కోల్ మైన్ (2, 2ఏ,5) గని అధికారులు ఆయనని ఘనంగా శాలువాతో సన్మానించారు. వారు ఏరియా ఇంజనీరుగా చేసిన సేవలను కొనియాడారు. పదవి విరమణ అనంతరం వారు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్.రమేష్ ప్రాజెక్ట్ ఆఫీసర్, అనిల్ గబాలే గని మేనేజర్, పి.రమేష్ ప్రాజెక్ట్ ఇంజనీర్, పొనుగోటి శ్రీనివాస్ గని రక్షణాధికారి, సీఎంవోఏఐ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్, పెరుమాళ్ళ శ్రీనివాస్ సీఎంఓఏఐ ఏరియా వైస్ ప్రెసిడెంట్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# చెత్తను రీసైకిల్ చేసి వస్తువులను తయారు చేయడం భేష్..







- మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్






**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూన్ 26..**
జమ్మికుంట: కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో మున్సిపల్ కమిషనర్ ఎండి ఆయాజ్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు చెత్త చెత్త కాదు.. చెత్తను రెడ్యూస్ చేయండి.. అంటూ మున్సిపల్ వాహనాలలో ప్రజలకు తెలిసేలా చెప్పడంతో పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆది గమనించి చెత్త నుండి వస్తువులను తయారు చేసి అందరిని ఆకట్టుకున్నారాని. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం ప్రతి మున్సిపాలిటీ పరిధిలో 100రోజుల ప్రత్యేక కార్యక్రమంలో గురువారం మునిసిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులు చెత్త నుండి వస్తువులను తయారు చేసి అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు చెత్తను ప్రజలు ఆరుబయట వేయకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, కానీ నేడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చెత్తను ఏ విధంగా వాడుకోవచ్చో చేసి చూపించారన్నారు. మార్పు మన నుండి మొదలు కావాలని, ఆ మార్పు అభివృద్ధి ముందుడుగు అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సుమారు 45 మంది విద్యార్థులు చెత్తతో వస్తువులను తయారు చేయగా మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులలో ముగ్గురికి బ్యాగులు బహూకరించగా, మిగిలిన వారికి పెన్నులను బహుకరించారు. ఈ మార్పు మనందరిలో రావాలని, చెత్తను రెడ్యూస్ , రియూజ్ , రీసైకిల్, చేయవచ్చని ఆయన సందర్భంగా తెలిపారు. పట్టణంలోని ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఇంటికి వచ్చే వాహనాలకు అందించాలని తెలిపడం జరిగింది. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని పాత వ్యవసాయ మార్కెట్ సమీపంలో చెత్తను రోడ్లపై వేసిన ప్రాంతాన్ని పూర్తిగా శుభ్రం చేసి అక్కడ గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ గా ఏర్పాటు చేసి ముగ్గులు వేసి ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇనస్పెక్టర్ మహేష్, సదానందం, శ్రీకాంత్ , శ్రీనివాస్, బాయ్స్ హైస్కూల్ హెడ్ మాస్టర్ సదానందం, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్యాస్ వినియోగదారులు రీ కేవైసీ అప్డేట్ చేసుకోవాలి

- పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి



సింగరేణి ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు, భారత్, ఇండియన్ (ఎల్పీజీ) గ్యాస్ వినియోగదారులు ఐఓసీ, బీపీసీఎల్ లకు కంపనీ ఆదేశాలమేరకు వినియోగదారులందరు, రీ కేవైసీ అప్డేట్ చేసుకోవాలని అర్జీ 1 ఏరియా అధికార ప్రతినిది, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి సూచించారు. వినియోగదారులందరు డెలివరీ బాయ్ వద్ద ఉన్న మొబైల్ ఆప్ ద్వారా అప్డేట్ చేసుకోవాలని, ఏదైనా వివరణ కావలసిన వారు డెలివరీ బాయ్ ని సంప్రదించాలని సూచించారు. ఈ రీ కేవైసీ, అప్ డేట్ ని జూలై 7వ తేదీలోపు చేసుకొని యెడల రీఫిల్ సిలిండర్ బుకింగ్ లో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, రీ కేవైసీ అప్ డేట్ లో జాప్యానికి గ్యాస్ ఏజెన్సీలు ఎలాంటి బాధ్యత వహించిందని ఆయిల్/గ్యాస్ కంపెనీ తెలియచేయడం జరిగిందన్నారు.

# కేజీ వీల్స్ కలిగిన ట్రాక్టర్లను రోడ్లపైకి తీసుకురావద్దు...

- ట్రాక్టర్ యజమానులకు విజ్ఞప్తి చేసిన అంతర్గాం తాహాసిల్దార్ తూమ్ రవీందర్ పటేల్:

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి



కేజీ వీల్స్ కలిగిన ట్రాక్టర్లను రోడ్లపైకి తీసుకురావద్దనీ ట్రాక్టర్ యజమానులకు అంతర్గాం తాహాసిల్దార్ తూమ్ రవీందర్ పటేల్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలోని అంతర్గాం తాసిల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం వర్షాకాలం ప్రారంభం దృష్టిలో పెట్టుకొని ట్రాక్టర్ యజమానులు కేజీ వీల్స్ కలిగిన ట్రాక్టర్లను రోడ్లపైకి తీసుకురావద్దనీ ట్రాక్టర్ యజమానులతో సమావేశం ఏర్పడడం చేయడం జరిగింది. ఈ సందర్భంగా అంతర్గాం తాహాసిల్దార్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు తూమూ రవీందర్ పటేల్ మాట్లాడుతూ.... వర్షాకాలం ప్రారంభం కావడంతో రైతులు వారి వరి పొలాలను కేజీ వీల్స్ తో దున్నించడం జరుగుతుందనీ,కావున ట్రాక్టర్ యజమానులు రోడ్ల పైన కేజీ వీల్స్ నడప రాదని ,రోడ్డు ప్రజలకు ఎంతో ముఖ్యమైనదని, ప్రధాన రహదారులపై కేజీ వీల్స్ నడపడం వలన రోడ్లు చెదిరిపోయి, గుంతలు ఏర్పడి, ప్రయాణికులు ప్రమాదాలకు గురి కావడం జరుగుతుందని, కావున ట్రాక్టర్ యజమానులు వీలైనంతవరకు పక్కదారిలో కేజీ వీల్స్ తీసుకువెళ్లాలని, ఎటువంటి పరిస్థితులలోను ప్రధాన దాహదారిని చెడిపే విధంగా చేయరాదని ,ఈ నియమ నిబంధనలను ఎవరైనా ఉల్లంఘించినట్టయితే, వారికి ప్రధాన రహదారిపై కేజీ వీల్స్ ట్రాక్టర్ పట్టుబడినట్లైతే మొదటి జరిమానా 5000 వేల రూపాయలు, రెండవ జరిమానా 10వేల రూపాయలు, మూడవ జరిమానా 20వేల రూపాయలు చట్ట ప్రకారం కేసు నమోదు చేయడం జరుగుతుందని ,సంబంధిత అంతర్గాం తాహాసిల్దార్ తూమూ రవీందర్ పటేల్ ట్రాక్టర్ యజమానులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ తూమూ రవీందర్ పటేల్, మండల ప్రజా పరిషత్ అధికారి బైరి వేణుమాధవ్, డిప్యూటీ తాహాసిల్దార్ ఎం తిరుపతి, అంతర్గాం మండల వ్యవసాయ అధికారి కాల్వల సతీష్, అంతర్గాం మండల ప్రజా పరిషత్ సూపర్డెంట్, మామిడాల కర్ణాకర్, సంబంధిత రెవెన్యూ అధికారులు, మండల ప్రజా పరిషత్ అధికారులు, ట్రాక్టర్ యజమానులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# లోన్ యాప్ ల ద్వారా లోను తీసుకుని తీర్చలేక యువకుడు ఆత్మహత్య



**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట జూన్ 26**
కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన గుత్తికొండ అఖిలేష్ (22) ఆర్థిక ఒత్తిడితో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బీటెక్ పూర్తి చేసిన అతడు కాలేజ్ రోజుల్లోనే స్నేహితుల దగ్గర అప్పులు చేసి, తరువాత లోన్ యాప్ల ద్వారా డబ్బులు తీసుకున్నాడు. అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపానికి గురై, గురువారం ఉదయం ఇంట్లో ఉరివేసుకున్నాడు. తండ్రి గుత్తికొండ రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి అనువైన స్థలాలు ఎంపిక చేయాలి:

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష...
- గ్రామ పంచాయతీ లకు సోంత భవనాల నిర్మాణం పై సమీక్షించిన జిల్లా కలెక్టర్...

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి



జిల్లాలోని 24 గ్రామపంచాయతీల భవనాల నిర్మాణానికి అనువైన స్థలాలు ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరెట్ లో గ్రామ పంచాయతీ లకు సోంత భవనాల నిర్మాణం పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ... పెద్దపల్లి జిల్లాలో 24 గ్రామాల్లో సొంత గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించాల్సి ఉందని, ఈ గ్రామాలలో జీపి భవనాల నిర్మాణానికి అనువైన భూములు ఎంపిక చేసి నివేదిక రేపటి వరకు అందించాలని కలెక్టర్ సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆయా గ్రామాలలో ఉన్న గ్రామపంచాయితీ పరిధిలోనీ ప్రభుత్వ భూము లను ఎంపిక చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డివిజనల్ పంచాయతీ అధికారి వేణుగోపాల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.